

ఆధార్ కార్డులను చూపిస్తున్న బంజరగూడ, బంకిగూడ, బంకిమెట్టు గూడ గిరిజనులు

- గిరిజనులకు అందని ప్రభుత్వ పథకాలు
- కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో కొర్రీలు
- తాగునీటికి తప్పని ఇబ్బందులు
- పాఠశాలకు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే
- అంగన్‌వాడీ కేంద్రం కూడా లేక అవస్థలు
- కొండపోడు పట్టాల పంపిణీలోనూ నిర్లక్ష్యం

ఆ మూడు గ్రామాల్లో

వారంతా ఇరవై ఏళ్ల కిందట బతుకుదెరువు కోసం ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లాకు వచ్చేశారు. కొత్తూరు మండలం పొనుటూరు పంచాయతీ పరిధిలో మూడు గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారు. వారందరికీ ఆధార్, ఓటు, రేషన్‌కార్డులతోపాటు ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు సైతం ఉన్నాయి. కానీ, ప్రభుత్వ పథకాలు మాత్రం దరిచేరడం లేదని ఆ మూడు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రం మంజూరులో అధికారులు కొర్రీలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు రహదారులు, తాగునీటి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. తమ సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు.

కొత్తూరు, మే 23(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల కేంద్రానికి శివారు ప్రాంతమైన పొనుటూరు పంచాయతీలోని బంకి బంజరగూడ, బంకిగూడ, బంకిమెట్టు గూడ గ్రామాల గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 30 గిరిజన కుటుంబాలు ఉండగా, 150 మంది నివసిస్తున్నారు. వీరంతా ఇరవై ఏళ్ల కిందట ఒడిశా నుంచి వచ్చి.. ఇక్కడ స్థిరనివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారు. ఆధార్, ఓటు, ఉపాధిహామీ జాబ్‌కార్డులు పొందారు. వీరిలో సుమారు 60 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారు. గతంలో సార్వత్రిక, పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కును సైతం వినియోగించుకున్నారు. గతంలో కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేశారు. ప్రస్తుతం విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీకి అధికారులు కాలయాపన చేస్తున్నారని (మిగతా 6వ పేజీలో..)

కనీస సౌకర్యాలు లేక..

- బంకి బంజరగూడలో గతంలో ఏనుగుల దాడి సమయంలో అటవీశాఖ అధికారులు తీయించిన బోరు మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం బిందెడు నీళ్లు కూడా రావడం లేదు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న వంశధార నదీ పరివాహక ప్రాంతానికి నడుచుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని మహిళలు వాపోతున్నారు.
- ఆ మూడు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కూడా లేదు. ఎవరికైనా అనారోగ్యం చేస్తే.. వారిని డోలీలో మోసుకుంటూ ప్రధాన రహదారి వద్దకు తీసుకురావాల్సిందే. అక్కడి నుంచి అంబులెన్స్‌లో వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో తమ పాట్లు వర్ణనాతీతమని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.
- గిరిజనులు జీవనం సాగించేందుకు పోడు వ్యవసాయానికి తగిన భూములు లేవు. బతుకుదెరువు కష్టంగా ఉందని, ప్రభుత్వం పోడు పట్టాలు మంజూరు చేసి.. తమను ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బడీ లేదూ.. 'అంగన్‌వాడీ' లేదు

పొనుటూరు పంచాయతీలోని బంకి బంజరగూడ, బంకిగూడ, బంకిమెట్టు గూడ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నారులు ప్రాథమిక విద్యాభ్యాసం చేయాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న పొనుటూరు గ్రామం వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాఠశాలకు పంపలేక చాలామంది చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతన్నారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 10మంది చిన్నారులు ఉన్నారు. 9మంది బాలింతలు ఉన్నారు. గతంలో ఈ మూడు గిరిజన గ్రామాలకు మినీ అంగన్‌వాడీ కేంద్రం ఉండగా.. ప్రస్తుతం దానిని మూసేశారు. కొత్తూరు మండలం కొత్తపొనుటూరు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఈ మూడు గ్రామాలకు కూడా పౌష్టికాహారం సరఫరా చేస్తున్నారు.



బంకిబంజరు గూడలో మినీ అంగన్‌వాడీ కేంద్రమైనా మంజూరు చేయాలని కోరుతున్న గిరిజనులు

లబ్ధిదారులు విధిగా ఫేస్‌యాప్ నమోదు చేసుకుంటేనే సరుకులు అందజేస్తారు. కాగా.. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారానికి నోచుకోలేకపోతున్నామని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. పౌష్టికాహార లోపం కారణంగా న్యూమోనియా వంటి వ్యాధులు సోకి ఆస్పత్రి పాలవుతున్నామని పేర్కొంటున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రమైనా మంజూరు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీవో విమలకుమారి వద్ద ప్రస్తావించగా.. ఆ మూడు గిరిజన గూడలకు మినీఅంగన్‌వాడీ కేంద్రం మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



మేజర్ రామ్‌గోపాలనాయుడును అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శభాష్.. మేజర్

- రామ్‌గోపాలనాయుడుకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల అభినందనలు

సంతబొమ్మాళి/అరసవల్లి/ టెక్కలి, మే 23 (ఆంధ్రజ్యోతి): కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడుని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శుక్రవారం ఢిల్లీలో అభినందించారు. సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన రామ్‌గోపాలనాయుడు ధైర్య సాహసాలు ప్రదర్శించి కీర్తిచక్ర అవార్డు పొందడం జిల్లాకే తలమానికమని పేర్కొన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి ఉగ్రవాదుల్ని ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన రామ్‌గోపాల్‌నాయుడు దేశం గర్వించదగ్గ సైనికుడని కొనియాడారు. దేశ రక్షణ వ్యవస్థలో రెండవ అత్యున్నతమైన కీర్తిచక్ర అవార్డుకు ఎంపికైన తొలి తెలుగువాడిగా చరిత్రలో నిలిచారని తెలిపారు. ఆయన పోరాట పటిమ, దేశభక్తి.. యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడు కూడా మేజర్ రామ్‌గోపాలనాయుడుకు అభినందనలు తెలిపారు. ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొని పోరాడిన ఆయనకు కీర్తిచక్ర అవార్డు దక్కడం అభినందనీయమన్నారు.

నిరసన భగ్నం



- కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేయాలి
- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్
- ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

పలాస, మే 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ భూటకమని, దీనిపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ చేసి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గలో నిరసనకు సన్నద్ధం కాగా.. పోలీసులు భగ్నం చేశారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావుతో పాటు పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. జిల్లాకు చెందిన కేశవరావును ప్రభుత్వమే భూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యచేసిందని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ బస్టాండు ఆవరణలో నిరసనకు పిలుపునిచ్చాయి. దీంతో బొడ్డపాడు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజాసంఘాలు, శ్రీకాకుళంలో ఉన్న సంఘాల నాయకులు శుక్రవారం ఉదయం కాశీబుగ్గ చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ వారితో మాట్లాడి.. ఆందోళన వద్దని వెళ్లిపోవాలని సూచించారు. తాము శాంతియుతంగా నిరసన చేపడతామని చెప్పినా పోలీసులు అంగీకరించలేదు. దీంతో ఆందోళనకారులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారితో చర్చించి. పూచీకత్తుపై విడుదల చేశారు. మొత్తం రెండు గంటలపాటు కాశీబుగ్గ బస్టాండు, పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ, పోలీసులు

- అనంతరం స్థానిక సూదికొండకాలనీలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్, పౌరహక్కులసంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, అమరుల బంధుమిత్రుల కమిటీ, ప్రజాకళామండలి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. వారు విలేకరులతో మాట్లాడుతూ.. 'జంట పట్టణాల్లో శాంతియుతంగా చేపడతామన్న నిరసన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం తగదు. తక్షణం మావోయిస్టు పార్టీతో ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలి. ఆపరేషన్ కగార్, ఆదివాసీల హననం ఆపాలి. పాలకులు రాజ్యాంగ చట్టాలను ఉల్లంఘించి మావోయిస్టులే టార్గెట్‌గా చేసుకొని ఇప్పటి వరకూ 550 మందిని హత్య (మిగతా 6వ పేజీలో..)





జూనియర్ కళాశాలల్లో బదిలీలు

- జిల్లాలో సుమారు 200 మందికి స్థానచలనం
- ప్రిన్సిపాల్స్‌కు, జేఎల్స్‌కు పనితీరు ఆధారంగా పాయింట్లు

నరసన్నపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల బోధన, బోధనేతన సిబ్బంది బదిలీల షెడ్యూల్‌ను ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఆన్‌లైన్ విధానంలో జూన్ 8వరకు బదిలీలను నిర్వహించనున్నారు. ఈసారి కొత్తగా ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్స్‌కు పనితీరు ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. ప్రస్తుతం కాలేజీలో ఐదేళ్లు ఒకేచోట్ల సర్వీసు పూర్తయిన ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. రెండేళ్లు సర్వీసు దాటిన వారు కావాలంటే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.

- 16శాతం హెచ్‌ఆర్‌ఏ ఉన్న కేటగిరి-ఏ ఉంటే ఏడాదికి 2 పాయింట్లు, 12శాతం హెచ్‌ఆర్‌ఏ పనిచేస్తున్న వారికి ఏడాదికి 4 పాయింట్లు, 10శాతం హెచ్‌ఆర్‌ఏ పరిధిలో పనిచేసే జేఎల్స్‌కు ఏడాదికి -6 పాయింట్లు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి ఏడాదికి 8 పాయింట్లు ఇస్తారు. పనితీరు ఆధారంగా బదిలీల్లో ప్రాధాన్యమిస్తారు.
- జేఎల్స్‌కు అయా సబ్జెక్టులో ఇంటర్ ఫలితాల్లో 40శాతం ఉత్తీర్ణులైతే ఎటువంటి పాయింట్లు ఇవ్వరు. 41-60శాతం వరకు పాస్ అయితే రెండు పాయింట్లు, 61-80శాతం వరకు 4 పాయింట్లు, 81శాతం నుంచి 100 శాతం లోపు ఉంటే ఆరుపాయింట్లు ఇస్తారు.
- కళాశాల ఉత్తీర్ణత ఆధారంగా ప్రిన్సిపాల్స్‌కు పాయింట్లు (మిగతా 6వ పేజీలో..)



80అడుగుల రోడ్డులో యోగాసనాలు వేస్తున్న మహిళలు

యోగా శిక్షణ ప్రారంభం

- శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో 600 మంది సాధన

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో శిక్షణ ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సుమారు 600 మందితో యోగా సాధన చేశారు. ఇద్దరు మాస్టర్ శిక్షకుల ఆధ్వర్యంలో ఆసనాలు వేసి.. ధ్యానం చేశారు. జూన్ 20 వరకు ఉచిత యోగా శిక్షణ కొనసాగుతుందని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. 'నేటి ఆధునిక జీవన శైలితో ప్రజలు అనేక రకాల శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం.. రోజూ యోగా సాధన చేయడమే ఏకైక మార్గం. ప్రజలు యోగాను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి. ఉచిత యోగా శిక్షణను వినియోగించుకోవాల'ని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఆయుష్ శాఖ సిబ్బంది చంద్రశేఖర్, మురళీ పాల్గొన్నారు.

కల చెదిరి.. కన్నీరు మిగిలి..

- వైద్య విద్యార్థి ఆత్మహత్య
- జగన్నాథపురంలో విషాదఛాయలు



మోతీలాల్ (ఫైల్)

టెక్కలి, మే 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యం అందించేలా తమ బిడ్డలను డాక్టర్లుగా చేయాలని ఆ తల్లిదండ్రులు ఉన్నతంగా చదివించారు. ముగ్గురు బిడ్డల్లో ఇద్దరు వైద్యవిద్యను అభ్యసించగా.. మరొకరు సాఫ్ట్‌వేర్‌లో రాణిస్తున్నారు. కాగా.. ఒక కుమారుడు మరో ఏడాదిలోనే పీజీ పూర్తిచేసి.. వైద్యుడిగా వస్తాడని మురిసిపోయిన ఆ తల్లిదండ్రులకు విషాదమే మిగిలింది. ఏమైందో.. ఏమో.. మెడికల్ కళాశాల వసతిగృహంలోనే ఆ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో పీజీ (రేడియాలజీ) విద్యార్థి సింగపురం మోతీలాల్(25) గురువారం సాయంత్రం హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనది టెక్కలి మండలం జగన్నాథపురం. మోతీలాల్‌కు నీట్‌లో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ వచ్చింది.



రోదిస్తున్న తండ్రి భాస్కరరావు

జిప్‌మర్ పాండిచ్చేరిలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 2024లో పీజీలో 925వ ర్యాంకు రావడంతో ఆంధ్ర మెడికల్ యూనివర్శిటీలో రేడియాలజీ విభాగంలో మూడు నెలల కిందట చేరారు. వసతిగృహంలో ఉంటూ అక్కడ చదువుతున్నారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ గురువారం మెడికల్ కళాశాల వసతిగృహంలోనే ఉరేసు కున్నారు. అంతవరకూ స్నేహితులతో సరదాగా గడిపిన మోతీలాల్ ఎందుకిలా చేశాడని వారికి కూడా తెలియని పరిస్థితి. వసతిగృహ నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మోతీలాల్‌కు శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా.. జగన్నాథపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కన్నీటిపర్యంతమవుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- మోతీలాల్ తండ్రి సింగుపురం భాస్కరరావు విశ్రాంతి ఉపాధ్యాయుడు. తల్లి భాగ్యం గృహిణి. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు రాజు సాఫ్ట్‌వేర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మోతీలాల్ చిన్నకుమారుడు. కుమార్తె సోనిక వైద్యురాలిగా విజయవాడలో పీజీలో చేరింది. దీంతో కుటుంబంలో అందరూ ఉద్యోగులు కావడంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో మోతీలాల్ ఆత్మహత్యతో విషాదఛాయలు అలుముకున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి బాగా చదువుకుని.. వైద్యుడిగా సేవలు అందిస్తాడని ఎన్నో కలలు కన్నామని ఆ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అయ్యో ఎందుకిలా చేశావంటూ బోరున విలపిస్తున్నారు. బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.



పెద్దమురహరిపురం

మేము సైతం భరతమాత సేవలో..



- రక్షణ విధుల్లో పీఎంపురం యువత
- త్రివిధ దళాల్లో 155 మంది విధులు
- సైనిక్ సేవా సమితి పేరుతో కార్యక్రమాలు

ఒక ఊరిలో ఒకరో ఇద్దరో సైనికులు ఉంటేనే విశేషం. ఓ పది మంది ఉంటే గొప్పగా చెప్పుకుంటాం. అలాంటిది ఏకంగా 125 మంది రక్షణ దళాల్లో ఉంటే... దేశమాత సేవలో తరిస్తుంటే... ఊరు ఊరంతటికీ గర్వకారణం కదూ. పెద్దమురహరిపురం గ్రామస్తులు అదే చెబుతారు. మరో 30 మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు. అంటే ఆ ఊరిలో మొత్తం 155 మంది సైనికులేనన్న మాట.

వజ్రపుకొత్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి)

ఉద్దానం యువతకు దేశ రక్షణ అంటే మక్కువ ఎక్కువ. ఈ క్రమంలో ప్రతి గ్రామంలో నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ తదితర దేశ రక్షణ దళాలలో విధులు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో రక్షణ దళాల్లో ఉన్న వారి గ్రామాలూ ఉన్నాయి. ఈ కోవకే చెందుతుంది వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం. ఈ గ్రామం మొత్తం జనాభా సుమారు వెయ్యిమంది. ఈ ఊరి నుంచి ఇప్పటి వరకు 125 మంది త్రివిధ దళాలలో విధులు నిర్వహిస్తూ దేశానికి సేవలు అందిస్తున్నారు. మొత్తం 155 మంది ఉండగా... ఇప్పటి వరకు 30 మంది ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం భారత్- పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఉన్నందున అవసరమైతే దేశరక్షణకు తాము మళ్లీ విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ సైనికులు చెబుతున్నారు.

సేవా కార్యక్రమాలలో...

వీరంతా సైనిక్ సేవా సమితి ఏర్పాటు చేసి గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పెద్దమురహరిపురంలోని ఓ వీధికి సైనిక వీధిగా నామకరణం చేశారు. ఆ వీధిలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. పెద్దమురహరిపురం యువతను ఆదర్శంగా తీసుకొని చుట్టు పక్కల గ్రామాల యువత సైనికులుగా ఉద్యోగాలు సంపాదించి దేశానికి తమ వంతు సేవలు చేస్తున్నారు. ఇటీవలే గ్రామంలో శ్మశాన వాటిక రహదారి వద్ద స్వరధామం పేరుతో ముఖద్వారం నిర్మించినట్లు సైనిక్ సేవా సమితి సభ్యులు చెప్పారు. యువత చదువుకొనేందుకు.. సైనికులుగా ఎంపికయ్యేందుకు అవసరమైన సాయాన్ని అందిస్తున్నారు. సైనికులుగా దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఒక మారుమూల గ్రామం నుంచి 155 మందికి పైగా సైనికులు దేశానికి సేవలు అందించడంపై చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.



పెద్దమురహరిపురంలో నిర్మించిన సుభాష్‌చంద్రబోస్ విగ్రహం



సైనిక్ సేవా సమితి నిర్మించిన శ్మశాన వాటిక ముఖద్వారం

దేశానికి సేవ చేయడం ఆనందంగా ఉంది..



దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. మా గ్రామానికి చెందిన సైనికులు వివిధ హోదాలలో ఉన్నారు. ప్రస్తుతం నేను ఉద్యోగ విరమణ చేసినా అవసరమైతే దేశం కోసం యుద్ధ రంగంలో దిగడానికి సిద్ధంగా ఉన్నాను. యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ వారిలో దేశభక్తిని పెంపొందిస్తున్నాం.

-జి.రామారావు, సైనిక్ సేవా సమితి అధ్యక్షుడు, పీఎంపురం

సైనిక్‌సేవా సమితితో సేవలు..



పెద్దమురహరిపుం సైనికులం కలసి సైనిక్ సేవా సమితి ఏర్పాటు చేసి గ్రామానికి వివిధ రూపాలలో సేవలు అందిస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నాం. గ్రామంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి యువతలో దేశభక్తి పెంపొందించేందుకు మావంతు ప్రయత్నం చేస్తున్నాం.

-జి.గంగయ్య, సైనిక్ సేవా సమితి ఉపాధ్యక్షుడు

యువత దేశరక్షణలో ముందుండాలి..



యువత దేశ రక్షణకు ముందుండాలి. మా గ్రామంలో పెద్దలు దేశభక్తిని నూరిపోయడంతోనే ఈ రోజు ఇంతమంది సైనికులు వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారు. మరింత మంది నిరుద్యోగ యువత సైనిక ఉద్యోగాలు పొందే విధంగా సేవా సమితి ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నాం. యువత ముందుకు వసే ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

-ఎ.రామారావు, సైనిక్ సేవా సమితి కోశాధికారి

గర్వంగా ఉంది..



పెద్దమురహరిపురం గ్రామం నుంచి 155 మందికి పైగా యువత దేశ రక్షణలో సేవలు అందించడం గర్వంగా ఉంది. మొదటి నుంచి గ్రామంలో యువతకు సైనిక ఉద్యోగాలపై మక్కువ ఎక్కువ. అందువల్లనే ఇంతమంది వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలి.

-జి.వసంతస్వామి, సర్పంచ్, పీఎంపురం

ఆ మూడు గ్రామాల్లో..

(ఐదో పేజీ తరువాయి)

గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో గృహాలు నిర్మించుకుందామన్నా.. తమ పిల్లలు ఉన్న చదువులకు వెళ్లాలన్నా కుల ధ్రువీకరణ పత్రాలు అనివార్యం కాగా.. వాటిని మంజూరు చేయడంలో గ్రామస్థాయి రెవెన్యూ అధికారి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పిల్లలు మధ్యలో చదువుకు దూరమై.. కూలికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి గృహాలు, కొండపోడు పట్టాల మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కె.బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా.. సర్టిఫికెట్లు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేస్తామని తెలిపారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

చదువుకు దూరం..



కుల ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు జారీ చేయడం లేదు. దీంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్య పరిష్కరించడం లేదు.

-సవర కలోడియా, బంకి బంజరగూడ

పౌష్టికాహారం అందడం లేదు..



మా మూడు గ్రామాల్లో సుమారు 10 మంది చిన్నారులు, 9మంది బాలింతలు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పౌష్టికాహారం అందడం లేదు. పిల్లలు, గర్భిణులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

-సవర జయరాజ్, బంకి బంజరగూడ

ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు..



ఇరవై ఏళ్ల కిందట ఒడిశా నుంచి ఇక్కడకు వచ్చి జీవనం సాగిస్తున్నాం. మా అందరికీ ఆధార్, ఓటు, రేషన్, ఉపాధిహామీ పథకం కార్డులున్నా, మాకు కులు ధ్రువీకరణ పత్రాలు మంజూరులో జాప్యం చేస్తున్నారు. దీంతో పిల్లల చదువుతోపాటు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాం.

-సవర కవుల్లో, బంకి బంజరగూడ

జూనియర్ కళాశాలల్లో బదిలీలు

(ఐదో పేజీ తరువాయి)

కేటాయిస్తారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజీబీవీ కళాశాలలు-25, మోడల్ పాఠశాలల్లో నడుస్తున్న కళాశాలలు-13 ఉన్నాయి. వీటిలో జూనియర్ లెక్చరర్స్ సుమారు 400 మందికిపైగా పనిచేస్తున్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారు తప్పనిసరిగా బదిలీ కావడంతో సుమారు 200 మంది లెక్చరర్స్ ప్రిన్సిపాల్స్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. రెగ్యులర్ సిబ్బంది బదిలీల తర్వాత కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న లెక్చరర్స్‌కు ఖాళీలు ఆధారంగా పోస్టులను కేటాయిస్తారు.

నిరసన భగ్నం

(ఐదో పేజీ తరువాయి)

చేశారు. కార్పొరేట్ సంస్థలకు అడవులను అప్పగించేందుకే.. ఆదివాసీలు, మావోయిస్టులను చంపేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా ఫాసిస్టు పాలనకు ఇదొక నిదర్శనమని తెలిపారు. సమావేశంలో తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, పత్రి దానేసు, మద్దిల రామారావు, సాలిన వీరాస్వామి, జోగి కోదండరావు, తామాడ త్రిలోచన, పోతనపల్లి అరుణ, నీలకంఠం, మద్దిల ధర్మారావు, పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు, తెప్పల అజయ్, బతకల ఈశ్వరమ్మ, మామిడి భీమారావు, వంకల పాపయ్య, జగన్, బర్ల గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొండేటివారి వీధిలో ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు. క్షీరాభిషేకం చేశారు. 12 మంది దంపతులతో శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరుని వివిధ రకాల పూవులతో ప్రత్యేకంగా అలంకరించారు.



వేంకటేశ్వరుని కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నగరాలపేట వద్ద ఉన్న బౌద్ధ స్థూపం

చారిత్రక ప్రదేశం... చూడాలంటే కష్టం

- బౌద్ధస్థూపానికి వెళ్లే రహదారి అధ్వానం
- పర్యాటకులకు అవస్థలు



అధ్వానంగా ఉన్న రహదారి

గార, మే 23 (ఆంధ్రజ్యోతి): కళింగపట్నం పంచాయతీలోని నగరాలుపేట వద్ద ప్రాచీన బౌద్ధస్థూపం సందర్శనకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. శతాబ్దాల చరిత్ర గల ఈ స్థూపం గత చరిత్రకు ఆనవాలుగా నిలుస్తూ... సందర్శకులను ఆకర్షిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు చెందిన పర్యాటకులు, బౌద్ధ భిక్షువులు ఇక్కడికి వస్తుంటారు. ఈ బౌద్ధ క్షేత్రానికి వెళ్లడానికి నగరాలుపేట రోడ్డు నుంచి సుమారు 500 మీటర్ల పొడవు న మట్టి రోడ్డు మాత్రమే ఉంది. ఎప్పుడో వేసిన గ్రావెల్ రోడ్డు పడిపోయింది. ప్రస్తుతం ఉన్న రహదారిలో వర్షాలకు గోతులు ఏర్పడి బురదమయంగా మారింది. సందర్శకులు తమ వాహనాలతో స్థూపం వరకు వెళ్లేందుకు రోడ్డు అనువుగా లేదు. దీంతో వాహనాలను రోడ్డు పక్కన నిలిపి కాలినడకన ఈ స్థూపం వద్దకు చేరుకోవాల్సి వస్తోంది. ఈ బౌద్ధ స్థూపం వరకు సరైన రహదారిని నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పర్యాటకులు, ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

బౌద్ధస్థూపం వరకు ఉన్న రోడ్డును పరిశీలిస్తాం. దీని అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-పి.గోవిందరావు, మండల ఇంజనీరింగ్ అధికారి



ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి శుక్రవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. వైశాఖ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ అర్చకులు, వేదపండితులు మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ, వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చైతన్య ధార్మిక గురువు మీసాల రామకృష్ణ అన్నారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో యోగాసనాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఎంపీడీవో జి.రామకృష్ణ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సరిత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవరుచుకోవాలి..

రణస్థలం, మే 23 (ఆంధ్రజ్యోతి): మానవతా విలువలు పెంపొందించుకోవాలని... సేవాభావాన్ని చిన్నప్పటి నుంచే అలవరుచుకోవాలని విద్యుత్ శాఖ ఇంజినీర్, సామాజికవేత్త రాజు హితవు పలికారు. కోష్ట గ్రామంలో మహిళా పోలీసు బి.అమ్మోజి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా వేసవి శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు మెడిటేషన్, సూర్య నమస్కారాల విశిష్టతను వివరించారు. తెలుగుభాష ప్రాధాన్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని... తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూలో...

ఎచ్చెర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన యోగా మంత్ కార్యక్రమాన్ని శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నెల రోజుల పాటు యోగా సంబంధిత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ సందేశాన్ని, యోగాంధ్ర -2025 థీమ్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. వచ్చే నెల 21న విశాఖ బీచ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో బీఆర్‌ఏయూ భాగస్వామ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, యోగా సమన్వయకర్త కేవీఎస్ మూర్తి తదితరులతో కలిసి వీసీ యోగాసనాలు వేశారు.



రణస్థలం: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



జి.సిగడాం: యోగా చేస్తున్న అధికారులు

కొత్తూరు తహసీల్దారుపై చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం జగన్నాథపురం పెత్తందార్లు కొమ్ముకాస్తూ, దళిత మహిళ లిమ్మక దేవిని బెదిరిస్తున్న కొత్తూరు తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్నాథపురం గ్రామానికి చెందిన లిమ్మక దేవి సాగులో ఉన్న భూమికి సంబంధించిన అన్ని రకాల ఆధారాలు ఉన్నప్పటికీ, సాగు చేయవద్దని, ఒకవేళ సాగు చేస్తే కేసులు పెడతామని కొత్తూరు తహసీల్దారు బెదిరిస్తున్నారన్నారు. సాగులో ఉన్న ఆమె భూమిపై కొందరి పెత్తందార్లు కన్నుపడిందని, భూమిని ఆక్రమించాలని చూసిన వారు ఆమెపై దాడిచేస్తే, కేసు పెట్టిందన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉందని, రక్షణ కల్పించాల్సిన తహసీల్దారు పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని వారంతా జేసీని కోరారు. కార్యక్రమంలో కులనిర్మూలన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాటసమితి జిల్లా కార్యదర్శి దుర్గాసి గణేష్, రెల్లికుల సంక్షేమ సంఘ నాయకుడు గొల్లపల్లి నందేశ్, మాలమహానాడు నాయకుడు సూర్యనారాయణ, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాం కోసం ఏపీ ఈఏపీ సెట్-2025 కొనసాగుతోంది. ఐదో రోజైన శుక్రవారం నిర్వహించిన రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 560కు 534 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 340కు 323 మంది హాజరయ్యారు. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి.

వృత్తిదారులను ఇబ్బందిపెట్టొద్దు



పనులు అడ్డుకుంటున్న రజకులు

పాత శ్రీకాకుళం, మే 24(ఆంధ్రజ్యోతి): కుల వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న తమను ఇబ్బందిపెట్టొద్దని బలగ ప్రాంతానికి చెందిన పలువురు రజకులు కోరుతున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. జిల్లా కేంద్రం బలగ ప్రభుత్వ ఆసుపత్రి (రిమ్స్) వెనుక నాగావళి నది ఒడ్డున గత కొన్ని దశాబ్దాలుగా బట్టలు ఉతుకుతూ 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. 1990లో వీరి అవసరాల కోసం నది ఒడ్డున గల సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని మునిసిపల్ అధికారులు కేటాయించారు. ఈ క్రమంలో కేంద్ర మాజీమంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు రూ.7 లక్షలు నిధులు మంజూరు చేశారు. వీటితో దోబీఘాట్, షెడ్, బోర్ వేసి విద్యుత్ కల్పించుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకు రజకులకు ఇబ్బంది లేకుండా ఇందులోని కొంత స్థలంలో మునిసిపల్ అధికారులు పార్కు నిర్మించారు. ఇప్పుడు ఈ పార్కును విస్తరణ పేరులో రజకులకు కేటాయించిన మిగిలిన స్థలంలో రెండు రోజులుగా యంత్రాలతో పనులు చేస్తున్నారు. దీంతో గత రెండు రోజులుగా రజకులు ఈ పనులను అడ్డుకుని నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, మునిసిపల్ ఇంజనీర్స్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఏపీ రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్స్ వేగులాడ దుర్గారావు, గురజాపు రాము ఈ స్థలాన్ని పరిశీలించి, కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వృత్తినే నమ్ముకునే వృత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఆమె ఇచ్చారన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఇచ్ఛాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ తెలిపారు. మద్యం షాపుల వద్ద ఎటువంటి ఉల్లంఘన జరగకుండా ప్రతీ రోజూ గస్తీ ఉంచామన్నారు. సారా, కల్తీ మద్యం, గంజాయి రవాణాపై ఎవరికైనా సమాచారం ఉంటే 14405 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యం ఉంచుతామన్నారు.

27న ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు ఈ నెల 27న నిర్వహించనున్నట్టు ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అనివెట్టి మండపంలో అనువంశిక ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు, గ్రామపెద్దలు, దేవదాయశాఖ సిబ్బంది సమక్షంలో ఈ హుండీల లెక్కింపు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

ఎచ్చెర్ల, మే 23(ఆంధ్రజ్యోతి): శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో సీఎస్‌ఈలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండ శివచరణ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని రజిత పతకం సాధించాడు. ఈ నెల 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగిన అండర్-23 67 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో పాల్గొని ప్రతిభ చూపాడు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

నగరంలోని ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ



శ్రీకాకుళం కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో గల సంతాన సాఫల్య (ఐవీఎఫ్) కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎడారిలా సయ్యద్‌ఖాన్ చెరువు



ఇచ్ఛాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన సయ్యద్‌ఖాన్ చెరువును అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో చెరువు ఎండి ఎడారిలా మారిపోయింది. దీంతో ఈ చెరువుపై ఆధారపడిన సుమారు 7వార్డుల ప్రజలు వాడుక నీటికి ఇబ్బంది పడుతున్నారు. చెరువులో పేరుకుపోయిన పూడికలు, పిచ్చి మొక్కలు తొలగించకోవడంతో చెరువులో నీరంతా దుర్వాసన వెదజల్లుతోంది. చెరువును బాగుచేసుంటే ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఉండేది కాదని బెల్లుపడ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి చెరువును బాగుచేస్తే రాబోయే వర్షాకాలంలో నీరు బాగుంటుందని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు.

అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు

● 'ప్రజాదర్బార్' వినతులపై ఎమ్మెల్యే శంకర్ తక్షణ స్పందన



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులపై శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అక్కడికక్కడే స్పందించి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం నగరం, రూరల్ మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్తు, పారిశుధ్యం, డ్రెయిన్లు, రోడ్లు, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతులపై అర్జీలు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీకి చెందిన వనరాస సురేష్ సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.66,900 చెక్కును ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం అందజేశారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాదర్బార్

● పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మే 23 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్య క్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, సనపల ఢిల్లీశ్వరరావు, నూకరాజు, అంబళ్ల రాంబాబు, బలగ శంకర్ భాస్కరరావు, అన్నెపు రాము పాల్గొన్నారు. ఇదిలావుంటే విశాఖపట్నం, మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన ఓ మహిళకు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ప్రజల్లో భయాందోళన మొదలైంది. ఈ క్రమంలో కూన రవికుమార్, టీడీపీ అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ మాస్కులు ధరించి ప్రజల మధ్యకు వచ్చారు. ప్రస్తుతం కరోనా మళ్లీ వ్యాపిస్తున్నట్టు వస్తున్న ప్రచారం కంటే మాస్కుల వాడకంపై ప్రచారం చేయాల్సిన అవసర ఉందని, అందుకే ప్రజాదర్బార్‌కు మాస్కులు ధరించి వచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పొందూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ వి.సుధీర్ తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ పనులు, ఇతర మరమ్మతులు కారణంగా పొందూరు టౌన్‌ఫీడర్ ఇండస్ట్రియల్ ఫీడర్, సిరిపురం ఫీడర్ కృష్ణాపురం ఫీడర్ పరిధిలోని పొందూరు పంచాయతీ, రాపాక, కొంచాడ, తండ్యాం, మలకాం పంచాయతీల పరిధిలో గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమావేశానికి తరలిరావాలి

ఆమదాలవలస, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ నెల 25న ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న కళాకారుల సంక్షేమ సంఘ సమావేశానికి నియోజకవర్గ కళాకారులంతా తరలిరావాలని సంఘం అధ్యక్షుడు టేకి త్రినాథరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వం నుంచి రావాల్సిన గుర్తింపు కార్డులపైన, పేద కళాకారులకు అందించాల్సిన ఆర్థిక సాయంపైన కళాకారుల సంక్షేమ సంఘం భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, దాస్యం లక్ష్మణరావు, కె.రామారావు, జి.జోగారావు, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమంగా పండ్లను మగ్గిస్తే కఠిన చర్యలు



మామిడి పండ్లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్లను రసాయనాలు వాడి కృత్రి మంగా మగ్గిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని మార్కెట్, బలగ, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో తన సిబ్బందితో కలిసి పలు పండ్ల దుకాణాల్లో తనిఖీలు చేశారు. పండ్లను నిల్వచేసే గోదాములను పరిశీలించారు. వ్యాపారులు తమ లాభాపేక్ష కోసం ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పలు దుకాణాల నుంచి మామిడి పండ్ల శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి కోట లక్ష్మి ఉన్నారు.

ప్రజలకు సక్రమంగా సరుకులు అందించండి



సీఎం చిత్రపటానికి పాల అభిషేకం చేస్తున్న దృశ్యం

కవిటి, మే 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా సరుకులు సక్రమంగా ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో శుక్రవారం కవిటి మండల రేషన్ డీలర్లు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిపోల వద్ద సక్రమంగా అందుబాటులో ఉండి కొలతలు తేడాలేకుండా పంపిణీ చేపట్టాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ విధానాన్ని రద్దుచేసి, రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడంపై డీలర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విప్ అశోక్‌ను సత్కరించారు.

స్మార్ట్ మీటర్ల వినియోగం వద్దు

అరసవల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వినియోగం వద్దని సీపీఎం రాష్ట్ర కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, ట్రూ అప్, సర్‌చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.గోవిందరావు, బి.తులసీదాస్, కె.మోహనరావు, బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, నంబూరు షన్ముఖరావు, అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాగిలాలతో తనిఖీలు



జాగిలాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆమదాలవలస, మే 23(ఆంధ్రజ్యోతి): గంజాయి మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో పోలీసులు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసులు, జీఆర్‌పీ, పీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ప్రత్యేక పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్ దాని పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్‌ఐ సనపల బాలరాజు, జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూధనరావు, ఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహం పునఃప్రతిష్ఠ

పొందూర్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అక్కమాంబ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి భక్తుల ఇచ్చిన విరాళాలతో శ్రీకారం చుట్టారు. శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు

శ్రీకాకుళం, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని శ్రీకాకుళం పార్లమెంట్ వైసీపీ పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు విమర్శిం చారు. శుక్రవారం జిల్లాకు చెందిన వైసీపీ నాయ కులతో, కార్యకర్తలతో సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపై చంద్రబాబుపై వ్యతిరేకత ప్రజల్లో వచ్చేసిందని చెప్పారు. సంక్షేమం ఊసేలేకుండా రెడ్‌బుక్ రాజ్యమేలుతోందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ.. ప్రజలకు మేలుచేసిన పార్టీ వైసీపీ అని.. భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచకపాలన జరుగుతుందని.. పరిపాలన గాడి తప్పిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్తలు చింతాడ రవికుమార్, గొర్లె కిరణ్‌కుమార్, పేడాడ తిలక్, కార్యకర్తలు పాల్గొ న్నారు. ఇదిలా ఉండగా.. ఇదే సమావేశానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గైర్హాజరయ్యారు.



రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకులు



పోలీసుల సమక్షంలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పొందూరు, మే 23(ఆంధ్రజ్యోతి): తుంగపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మూడు నెలలు తర్వాత అడ్డంకులు తొలగాయి. గ్రామంలో రావిచెట్టు నుంచి సారవుగెడ్డ వెనుక వరకు రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాని రోడ్డు ఆక్రమణతో నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. సచివాలయ కార్యదర్శి ఆక్రమణలు తొలగించాలని నోటీసులు అందించినా ఆక్రమణలు తొలగించకపోవడంతో నిర్మాణానికి ఆటంకటం ఏర్పడింది. గ్రామ సర్పంచ్ పప్పల వేణుగోపాలరావు ఎంపీడీవోకు, తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. రీసర్వే నిర్వహించి ఆక్రమణలు గుర్తించారు. దీంతో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా ఆక్రమణదారుడు స్పందించకపోవడంతో ఎస్‌ఐ వి.సత్యనారాయణ, సిబ్బందితో వచ్చి ఎంపీడీవో మన్మథరావు పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగించారు. రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

పిల్లల వివరాలు నమోదు చేయాలి

కవిటి, మే 23(ఆంధ్రజ్యోతి): సహిత ఉపాధ్యాయులు సర్వేలో గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు నమోదు చేయాలని ఎంఈవో ధనుంజయ మజ్జి కోరారు. జూన్ 6వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. కవిటి మండలంలో శుక్రవారం వరకు 10 మంది పిల్లలను గుర్తించామన్నారు. రిసోర్సుపర్సన్స్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

సరుబుజ్జిలి, మే 23(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు తమ్మినేని కోదండరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సహస్ర నామార్చనలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నానుపాత్రుని రామమూర్తి, అర్చకులు నానుపాత్రుని గురునాథరావు, భక్తులు పాల్గొన్నారు

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఆమదాలవలస, మే 23(ఆంధ్రజ్యోతి): వంజంగి సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద పేకాట ఆడుతూ పట్టుబడ్డ 13 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సనపల బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వంజంగి గ్రామ సమీపంలో పేకాడ ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.21,850, పది సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ఆమదావలస పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కేశవరావు మృతదేహం కోసం గ్రామస్థుల నిరీక్షణ

టెక్కలి, మే 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల అగ్రనేత నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు బుధవారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా పరిధిలో ఎన్‌కౌంటర్‌కు గురికావడంతో ఆయన మృతదేహం కోసం కోటబొమ్మాళి మండలం జీయన్నపేట గ్రామస్థులు నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే కేశవరావు బంధువులు మృతదేహం కోసం జగదల్‌పూర్ వరకు వెళ్లగా మృతదేహం ఇవ్వలేమని స్థానికులు చెప్పడంతో గురువారం అర్ధరాత్రి వారంతా వెనుదిరిగారు. ఇదిలా ఉండగా కేశవరావు మృత దేహాన్ని అప్పగించాలని కేశవరావు బంధువులు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. మృతదేహం అప్పగిస్తే జీయన్నపేటలో అంత్యక్రియలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కేశవరావు సోదరుడు ఢిల్లేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామమైన జీయన్నపేట వచ్చి గ్రామస్థులతో మాట్లాడారు. అయితే ఆయన వెనుక పోలీసులు, షాడో బృందాన్ని పెట్టడంతో పలువురు ఆయనను కలిసేందుకు ఇబ్బందులు పడ్డారు.

రెండిళ్లలో చోరీ

పలాస, మే 23(ఆంధ్రజ్యోతి): పలాస మండలం నారాయణపురం గ్రామానికి చెందిన అంధవరపు బాలకృష్ణ, అంధవరపు సులోచనలకు చెందిన ఇళ్లలో బుధవారం చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలకృష్ణ విశాఖపట్నంలో పనిచేస్తున్నారు. ఈనెల 21న అరతులం బంగారు ఆభరణాలు బీరువాలో పెట్టి విశాఖ వెళ్లారు. ఇంటిలో చోరీ జరిగినట్లు ఆయన సోదరుడు ఫోన్ చేయడంతో శుక్రవారం వచ్చి పరిశీలించి బంగారం పోయినట్లు గుర్తించారు. అదేవిధంగా ఉపాధి కూలీగా పనిచేస్తున్న సులోచన ఇంటిలో లేని సమయంలో అప్పుగా తీసుకువచ్చిన డబ్బులు, దాచుకున్న రూ.50వేలు నగదు బీరువాలో పెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువా విరగ్గొట్టి డబ్బులు కాజేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఘటనలు ఒకేరోజు జరగడంతో గ్రామంలో ఉన్న ఓ వ్యక్తిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించి చుట్టు పక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెండు పాడి గేదెలు మృతి

కంచిలి, మే 23(ఆంధ్రజ్యోతి): మండపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు బెండాళం గణపతికి చెందిన రెండు పాడి గేదెలు శుక్రవారం మృతి చెందాయి. వేకువ జామున పాలు పితికిన తర్వాత గేదెలకు ఆహారం పెట్టారు. అనంతరం కాసేపటి తర్వాత ఆ రెండు గేదెలు అస్వస్థతకు గురై పడిపోయాయి. సమాచారం అందుకున్న వైద్యులు వచ్చి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాయి. ముర్రా జాతికి చెందిన ఈ గేదెలు రూ.రెండు లక్షల విలువైనవని, వీటిని అప్పుచేసి కొనుగోలు చేసినట్టు రైతు తెలిపారు. మృతి చెందిన పశువులకు పంచనామా నిర్వహించారు. నిరుపేద కుటుంబానికి చెందిన పాడి రైతు గణపతిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ని ఢీకొన్న కారు


నుజ్జయిన కారు ముందు భాగం

జి.సిగడాం, మే 23(ఆంధ్రజ్యోతి): వాంధ్రంగి రైల్వే బ్రిడ్జి మీద శుక్రవారం ట్రాక్టర్‌ని ఓ కారు ఢీకొనగా.. ఒకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం మండలం గూడెం గ్రామానికి చెందిన రాకేష్ కారుతో రాజాం వైపు వస్తూ.. వేగాన్ని అదుపు చేయలేక ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు మందు భాగం నుజ్జు నుజ్జయింది. రాకేష్‌కి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వై.మధుసూధనరావు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పెళ్లికి వెళుతున్న వాహనం బోల్తా


కాలువలో బోల్తా పడిన వాహనం

పోలాకి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలమర పాలవలస కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం పోలాకి నుంచి పిన్నింటిపేటకు పెళ్లి వారితో వెళ్తున్న వాహనం అదుపు తప్పి సమీపంలోని వంశధార కాలువలో బోల్తా పడింది. ఈ వాహనంలో 15 మంది వెళుతున్నారు. అయితే పలువురికి స్వల్ప గాయాలు తప్ప ఎటువంటి నష్టం వాటిల్లలేదని స్థాని కులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ప్రమాద ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని, సమాచారం మేరకు క్షేత్రస్థాయికి వెళ్లామని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి సపర్యలు చేశారు. ఇద్దరు వ్యక్తులకు గుండెపై బలమైన గాయాలైనట్టు చికిత్స పొందుతున్నట్టు బంధువుల సమాచారం. ఎస్‌ఐ రంజిత్‌కుమార్ కేసు నమోదు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రణస్థలం, మే 23(ఆంధ్రజ్యోతి): లోచర్లపాలెం గ్రామానికి చెందిన సింకు శ్యామలరావు (29) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్యామలరావు గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంతనే చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శ్యామలరావు సోదరుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

అక్రమాలు రుజువైతే శాఖాపరమైన చర్యలు

ఎల్.ఎన్.పేట, మే 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయితే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తీసుకుంటామని ఏపీడీ పి.రాధ స్పష్టంచేశారు. బొత్తాడసింగి గ్రామంలో ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు గ్రామస్థులు డ్వామా పీడీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం గ్రామ సచివాలయంలో ఉపాధి వేతనదారులను విచారించారు. పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాదికారులకు పంపనున్నామని ఆమె తెలిపారు. ఆ తరువాత జిల్లా అధికారుల ఆదేశాలతో చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వజ్రపుకొత్తూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పల్లిసారధి హైస్కూల్‌లో 1989-94 సంవత్సరాల మధ్య చదివిన విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.



తాగునీటికి ఇక్కట్లు

- వారం రోజులుగా రాని 'ఉద్దానం' నీరు
- బోర్లు అడుగంటాయంటున్న గ్రామస్థులు
- ఇదీ బుడంబో గ్రామ దుస్థితి

హరిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మందస మండలం ఏజెన్సీ ప్రాంతమైన బుడంబో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామంలో రెండు తాగునీటి పథకాలు, మూడు బావులు, రెండు బోర్లు ఉన్నా ప్రయోజనం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. బోర్లలో నీరురాక పోవడంతోపాటు బావులు అడుగంటాయి. దీంతో ఒక బిందె నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఉద్దానం ప్రాజెక్టు నుంచి గత వారం రోజులుగా నీటి సరఫరా కాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీంతో సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పక్క గ్రామం నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. నీటి ఎద్దడి విషయమై మందస ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ ప్రసన్నకుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా గ్రామాన్ని సందర్శించి తగుచర్యలు తీసుకుంటామన్నారు.



కుళాయి నుంచి నీరు రావడం లేదని చూపిస్తున్న గిరిజనుడు (ఇన్‌సెట్‌లో) దిష్టిబొమ్మలా ఉన్న నీటి ట్యాంకు

పాడైన బోరు

పలాసరూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): పలాస మండలం సరియాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురైంది. పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం అందిస్తున్నా నీరు లేని సమ యంలో ఈ బోరు ఎంతగానో ఉపయోగ కరంగా ఉండేదని, ప్రస్తుతం పనిచేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబు తున్నారు. బోరు నిర్వహణ లేకపోవడంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని, అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరు తున్నారు.


పని చేయని బోరు

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

జిల్లాలో వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆలయాల వార్షికోత్సవాలు నిర్వహించారు. శ్రీముఖలింగంలో గ్రామోత్సవం చేపట్టారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వైశాఖ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో వేంచేపుచేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి ఉత్సవం చేపట్టారు. భక్తులు స్వామికి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అప్పారావు, శ్రీకృష్ణ, అచ్యుత, సింహాచలం, యోగి, శివ తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు: పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా ఉమా నీలకంఠేశ్వరుని కల్యాణం

ఎల్.ఎన్.పేట, మే 23(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురం గ్రామంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వల్లూరి బుచ్చిబాబు, వేద పండితుడు బి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకుడు తెలిపారు. గ్రామస్థులతో పాటు సమీపంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

నందిగాం, మే 23(ఆంధ్రజ్యోతి): దిమ్మిడిజోలలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ పదో వార్షికో త్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ధర్మకర్త కొల్లి శ్రీరాములు, గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితుడు మదన్ మోహన్ మిశ్రా, ఆలయ అర్చకుడు రవి పర్యవేక్షణలో విశేష పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చేపట్టారు. అలాగే అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాపుతెంబూరుకు చెందిన దత్త పీఠాధిపతి నిర్విశ్యానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సాయంత్రం శివ, పార్వతుల తిరువీధి నిర్వహించగా ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులిచ్చి భక్తిభావం చాటుకున్నారు.


ఎల్‌ఎన్‌పేట: స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


నందిగాం: ప్రత్యేక అలంకరణలో శివ పార్వతుల విగ్రహాలు

గంటపేటలో..

పోలాకి, మే 23(ఆంధ్రజ్యోతి): గంటపేట గ్రామంలో వేంచేసి ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 27వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు పండిత రాజేశ్వరరావు పాణిగ్రాహి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, తిరువీధి ఉత్సవం చేపట్టారు. కార్యక్రమాల్లో భాగంగా శనివారం చల్లబంద బాలికల కోలాట ప్రదర్శన, ఆదివారం జముకుల పాటలు, 26న గీతాపారాయణం, సాయంత్రం ఉలవల బస్తా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త తార రాజారావు, ముప్పిడి ప్రసాద్ తెలిపారు.

న్యూస్ బాక్స్

రామ్‌గోపాల్‌నాయుడుకు అభినందన

నందిగాం, మే 23(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడు కీర్తిచక్ర అవార్డు పొందడంపై నందిగాంలో అభినందనలు వెల్లువెత్తాయి. రామ్ గోపాల్‌నాయుడు నందిగాంకు చెందిన డిక్కల మన్మోహనరావు(బుజ్జి), పద్మావతిల అల్లుడు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు పొందడం ఆనందంగా ఉందని అత్తమామలు, గ్రామస్థులు పేర్కొన్నారు.

హైఓల్టేజీతో విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

కాశీబుగ్గ, మే 23(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 11వవార్డు పెద్ద బ్రాహ్మణ వీధిలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హై ఓల్టేజీ వచ్చి విద్యుత్ ఉపకరణాలు పాడయ్యా యి. రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు, టీవీలు ఇతర విద్యుత్ ఉపకరణాలు అధిక ఓల్టేజీ ప్రభావానికి గురై పాడయ్యాయని స్థానికులు తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వీధి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, శుక్రవారం హై ఓల్టేజీ వచ్చి విలువైన విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

నందిగాం, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగురకం విత్తనాలు రాయితీపై అందించనున్నామని, అవసర మైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం కావడమే కాకుండా యూరియా వినియోగం తగ్గుతుందని, అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

జలుమూరు (సారవకోట) మే 23 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారంఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహనకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన జరుగు సమావేశానికి మండల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇద్దరు కార్యదర్శులకు పదోన్నతి

పోలాకి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు వచ్చినట్లు ఎంపీడీవో రవికుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ బి.ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. అంపలాం సచివాలయ కార్యదర్శి పైల తేజేశ్వరరావుకు కుసుమపోలవలస సచివాలయం గేడ్-5 కార్యదర్శిగా, కోడూరు సచివాలయ కార్యదర్శి ఆరవల్లి కాత్యాయని బొద్దాం సచివాలయంలో పదోన్నతిపై నియమితులయ్యారన్నారు. జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

పాతపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, రాత్రి పది గంటల తరువాత మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకొంటామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరు బయట మద్యం అక్రమంగా కలిగి ఉన్న, మద్యం సేవించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

26న ఆలయ వార్షికోత్సవం

మందస, మే 23(ఆంధ్రజ్యోతి): మందసలోని అన్నపూర్ణ గ్రామదేవత ఆలయ వార్షికోత్సవం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు భవానీ స్వాములతో హోమం, 8 గంటలకు అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం, మధ్యాహ్నం నారాయణసేవ కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎస్పీ


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

పలాస, మే 23(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. స్వయంగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, చీటింగ్ తదితర ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు పంపారు. తదుపరి తీసుకున్న చర్యలను డీపీవో కార్యాలయంలో అందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

పాఠశాలల ప్రారంభం నాటికి విద్యా కానుకలు


విద్యాకానుకుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

నరసన్నపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా కానుకల కిట్లను అందించను న్నామని, దీనికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి అన్నారు. శుక్రవారం విద్యాకానుకల గోడౌన్‌ను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్, బూట్లు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన కలిగించాలి

జలుమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు అవగాహన కలిగించాలని ఆ శాఖ అధికారి మంగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ రంగంలో 15 శాతం వృద్ధి రేటు పెంచేందుకు గ్రామాల్లో రైతులను చైతన్యం చేయాలన్నారు. వరితో పాటు ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, జీడిమామిడి సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు వినియోగించి తక్కువ నీటితో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చనే విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీపై అవగాహన కలిగించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, వ్యవసాయాధికారి కె.సురేష్ పాల్గొన్నారు.

జర్మనీ మినీ మహానాడుకు ఎమ్మెల్యే శిరీష


ఎయిర్‌పోర్టులో శిరీష దంపతులకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

పలాస, మే 23(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఈనెల 24, 25వ తేదీల్లో జరగనున్న మినీ మహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్నచౌదరి శుక్రవారం వెళ్లారు. ఈ మేరకు అక్కడి ఎయిర్‌పోర్టులో వారికి ఎన్ఆర్ఐలు, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు కొర్ర పాటి సుమంత్, దున్న అఖిల్, పార్లపల్లి రాజశేఖర్, విక్రమ్‌కుమార్, సుంకు కల్యాణ్ తదితరులున్నారు.

రావివలసలో పీఆర్ అధికారుల పర్యటన


చిన్న నారాయణపురంలో కల్వర్టును పరిశీలిస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు

టెక్కలి, మే 23(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం రావివలస గ్రామస్థులతో 'మన ఊరు-మాటామంతి'లో రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధికి పనులకు హామీ ఇవ్వడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల బృందం గురువారం రావివలస, దామోదరపురం, నారాయణపురం గ్రామాలను సందర్శించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ జి.రవికుమార్, ఈఈ రౌతు సూర్యప్రకాష్, డీఈఈ ఎం. సుధాకర్, మండల ఇంజనీర్ లక్ష్మనాయుడు తదితరులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి రాక పోకల మార్గాల విస్తరణ, చిన్ననారాయణ పురం, దామోదరపురం, రావివలస గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, శ్మశాన వాటికలకు రో డ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, అప్రో చ్ రోడ్లు, కల్వర్టులు ఇలా.. సుమారు రూ.12 కోట్లతో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులన కలెక్టర్ ఆమోదించిన తరువాత యుద్ధప్రాతిపదికన చేపట్ట నున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్ఎల్ నాయుడు, మాజీ సర్పంచ్ బడే జగదీష్, యా దవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీష్, అనపాన జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పంచాయతీ రాజ్ ఎస్ఈ జి.రవికుమార్ ఎండల మల్లన్న స్వామిని దర్శించుకున్నారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత


యోగాలో పాల్గొన్న ఎంపీడీవో కె.అప్పలనాయుడు

జలుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది కార్యాలయం తెరచిన వెంటనే అరగంట సమయం యోగాకు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 21 వరకు కార్యాలయాల్లో ఉదయం తప్పనిసరిగా యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి మంగమ్మ, వ్యవసాయాధికారి కె.సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి


తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

జలుమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎండీ యూ వాహనాల రద్దుతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ జె.రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండేళ్లుగా బకాయి ఉన్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కమీషన్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండీయూ వాహనాల రుణాలకు సంబంధించి ఎన్‌ఓసీలు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎండీ యూ ఆపరేటర్ల సంఘం మండల అధ్యక్షుడు ప్రసాద్, ఆపరేటర్లు జనార్దన, శంకర్, అచ్యుతరావు, పోలినాయుడు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.